క్లుప్తంగా

విద్యారంగానికి నిధులు పెంచండి..

సింగరేణి(కొత్తగూడెం): నైపుణ్యానికి పెద్దపీట పేరుతో కార్పొరేట్లకు పెద్దపీట వేస్తున్నారని, విద్యారంగానికి 3.06 శాతం నిధులు సరిపోవని, ఉన్నత విద్యనభ్యసించే వారికి 3శాతం వడ్డీ ఎత్తివేసి, వడ్డీలేని రుణాలు ఇవ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో బడ్జెట్ కేటాయింపులను నిరసిస్తూ నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 24న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత

పాల్వంచ: పట్టణంలోని కరకవాగు ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న జి.సురేష్ అనే ఉపాధ్యాయుడు పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించారు. సురేష్ టెట్, డీఎస్సీ రాసే అభ్యర్థుల కోసం వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసి ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ ఇచ్చారు. అర్హత సాధించిన వారి సహకారంతో స్టడీ మెటీరియల్, గత పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానం సాధించిన బానోతు లిఖితకు రూ.వెయ్యి, పేరూరి ప్రణీతకు రూ.500 నగదును ప్రోత్సాహకంగా అందించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పూర్ణచందర్ రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

కార్మికులకు 'సంక్షేమం' అందించాలి..

సింగరేణి(కొత్తగూడెం): నిర్విరామంగా శ్రమించి కంపెనీకి లాభాలు తెచ్చిపెడుతున్న సింగరేణి కార్మికుల సంక్షేమం పట్ల తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని, తక్షణ చర్యలు చేపట్టాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మంగళవారం ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఈ అంశంతోపాటు మరికొన్ని అంశాలపై సింగరేణి సీఎండీకి ఫ్యాక్స్ ద్వారా లేఖ పంపించారు. ప్రధానంగా ఈ ఏడాది కంపెనీ సాధించిన లాభాల్లో 38శాతం వాటాను ఈనెల జీతంతో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయండి

జూలూరుపాడు: కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, బురదమయంగా మారిన మట్టి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బానోత్ దుర్గాప్రసాద్, సుమన్, నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

పాఠశాలలకు వితరణ

టేకులపల్లి: ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని థాయిలాండ్‌కు చెందిన సీపీ సీడ్స్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పియపోర్న్ నినలాయాగనన్, డీఎం బిజ్జంకి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని బర్లగూడెం, ఎర్రాయిగూడెం ప్రాథమిక పాఠశాలలకు కంపెనీ సహకారంతో స్థానిక నందినీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో రెండు పాఠశాలలకు 20 బల్లలు, రెండు వాటర్ ప్యూరిఫైయర్, స్టేషనరీ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పాదెం వెంకటేశ్వర్లు, నాగినేని నరసింహారావు, ఎస్ఎం.పాషా, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

సుజాతనగర్: విద్యానగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో పాత అంజనాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు నోటు పుస్తకాలు, స్కేళ్లు, రబ్బర్లు, పలకలు, బలపాలు మంగళవారం పంపిణీ చేశారు. కొల్లు నాగేశ్వరరావు, నీరుకొండ హనుమంతరావు, విజయ్‌మోహన్, కామేశ్వరరావు, గురుమూర్తి, పాండురంగారావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు అందజేత

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను ఏరియా జీఎం జాన్ ఆనంద్ అందజేశారు. మంగళవారం జీఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2022 సంవత్సరం వరకు ఒప్పంద కార్మికులకు ఖాతాల్లో జమా అయిన డబ్బులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు అందజేశారు.

మహిళలను ప్రోత్సహించాలి

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల మహిళలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సెర్ప్ సీసీలు, వీఓఏలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, మహిళలకు స్వయం ఉపాధి యూనిట్ల మంజూరు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరయ్యే నిధుల సహాయంతో స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పుకునేలా వారికి మార్గదర్శకం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా తోడ్పాటు నందించాలని కోరారు.

సరిహద్దులు అస్పష్టం.. వీడని నిర్లక్ష్యం

- వివాదాస్పదంగా భూముల క్రయవిక్రయాలు
- చోద్యం చూస్తున్న అటవీ, రెవెన్యూ, సింగరేణి అధికారులు


కొత్తపూసపల్లి పరిధిలో సాగులో ఉన్న భూమి

ఇల్లెందురూరల్: సింగరేణి చరిత్రలో బొగ్గు వెలికి తీసిన తొలి గ్రామం అది. అప్పటికే స్థానికంగా నివాసం ఉన్న జనసమూహంతో పాతపూసపల్లిగా, సంస్థలో పని కోసం వలస వచ్చిన వారితో కొత్తపూసపల్లిగా రెండు గ్రామాలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో అటవీ, రెవెన్యూ, సింగరేణి శాఖలకు సంబంధించిన భూములు ఉన్నాయి. ఇల్లెందు ఏరియాలో గనులు అంతరించిపోవడంతో కొత్తపూసపల్లి నుంచి కొంతమంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. అంతేకాకుండా భూములను కూడా అధిక మొత్తంలో ఓ గిరిజన ఆసామికి విక్రయించారు. ఈ వ్యవహారంపై కొంతమంది రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో భూముల క్రయవిక్రయాలు వివాదాస్పదమయ్యాయి.

వీడని సరిహద్దు సమస్య...

మండలంలో అటవీ, రెవెన్యూ శాఖల భూములకు సంబంధించి సరిహద్దు వివాదం నేటికీ అస్పష్టంగానే ఉంది. ఎక్కడా వివాదాలు లేవని పైకి చెబుతున్నా ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు రెండు శాఖల అధికారులు ఆయా భూములు తమవంటే తమవని పట్టుపడుతున్నారు. ఇటీవల జేకే ఓసీ భూసేకరణ సమయంలోనూ సరిహద్దు సమస్య వచ్చినా... అక్రమాల వెలుగులో బైటకు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. సర్వే నంబర్ 588, 559లో కొత్తపూసపల్లి భూభాగం ఎక్కువగా ఉంటుంది. ఇందులో 588లో కొంతభాగం అటవీభూములు, మరికొంత భాగం రెవెన్యూ భూములు ఉన్నట్లు అధికారులు పలు సందర్భాల్లో వెల్లడించారు. ఇక సర్వే నంబర్ 559లో సింగరేణి సంస్థ భూములు అధిక విస్తీర్ణంలో ఉన్నట్లు తెలుస్తోంది.

మొక్కుబడి విచారణ ఫలితమే..

ఏడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భూరికార్డుల సమగ్ర ప్రక్షాళన చేపట్టింది. ప్రతీ గ్రామంలోనూ గ్రామసభలు నిర్వహించి అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసింది. సాగులో ఉన్నప్పటికీ అడిగిన ధృవీకరణ పత్రాలు చూపలేదన్న సాకుతో చాలా గ్రామాల్లో గిరిజనేతరులకు అర్హత ఉన్నా నాటి అధికారులు మొక్కుబడి సర్వేతో పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయలేదు. ఇలా సింగరేణి ఆవిర్భావం నుంచి అంటే వందేళ్లకు పైగా సాగులో ఉన్నప్పటికీ నిబంధనలు సాకుగా చూపి కొత్తపూసపల్లి గ్రామానికి చెందిన గిరిజనేతరులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయలేదు. ఇదే సమయంలో ఆయా ప్రాంతాలలో అటవీ భూములను కూడా నిర్ధారించారు. కానీ ఆయా భూముల వివరాలపై ప్రజలకు స్పష్టత నివ్వకపోవడంతో ఎప్పటిలాగే స్థానిక రైతులు ఆయా భూములను సాగు చేస్తూ వచ్చారు.

వివాదాస్పదంగా క్రయవిక్రయాలు...

ఎన్నేళ్లు గడిచినా తమకు పట్టాదారు పాస్‌పుస్తకాలు రావని భావించిన కొత్తపూసపల్లి గ్రామానికి చెందిన గిరిజనేతరులు అప్పటి వరకు తమ ఆధీనంలో ఉన్న భూములను విక్రయించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో ముందుగా ఒక రైతు తన ఆధీనంలో ఉన్న అధిక విస్తీర్ణంతో కూడిన భూమిని పాలేరు ప్రాంతానికి చెందిన ఓ గిరిజన ఆసామికి విక్రయించాడు. మిగిలిన గిరిజనేతరులు కూడా తమ ఆధీనంలో ఉన్న భూములను క్రమంగా అతనికే విక్రయిస్తూ వచ్చారు. అయితే సదరు ఆసామి ఇదే ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేస్తూ రెండు గ్రామాల ప్రజలకు పెద్ద దిక్కుగా మారాడు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంపై ఏజెన్సీ చట్టాలకు అనుగుణంగా అటవీ భూములను విక్రయించడం నేరమని పేర్కొంటూ కొందరు యువకులు రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న రెండు గ్రామాలలో అలజడి ప్రారంభమైంది. ఇంత జరుగుతున్నా అటవీ, రెవెన్యూ, సింగరేణి అధికారులు భూములపై స్పష్టత ఇవ్వకుండా చోద్యం చూడటం రెండు గ్రామాలలో భూముల క్రయవిక్రయాలపై వివాదాలకు ప్రధాన కారణంగా నిలిచింది.

జాయింట్ సర్వే చేస్తాం..



కొత్తపూసపల్లి, పాతపూసపల్లి గ్రామాల పరిధిలో భూముల క్రయవిక్రయాల వ్యవహారం మా దృష్టికి వచ్చింది. ఆయా భూములపై స్పష్టత ఇచ్చేందుకు వెంటనే అటవీ, రెవెన్యూ శాఖల జాయింట్ సర్వే చేపడతాం. రెండు రోజుల్లో వివాదాలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం.

– రవికుమార్, తహసీల్దార్, ఇల్లెందు

ఇక్కడి నీళ్లను తరలించడం గర్హనీయం


సమావేశమైన అఖిలపక్షం నాయకులు

టేకులపల్లి: ఏజెన్సీ జిల్లా కొత్తగూడెంను ఎండబెట్టి మైదాన ప్రాంతాలకి సీతారామ నీళ్లను తీసుకెళ్లడం గర్హనీయమని, రోళ్లపాడు రిజర్వాయర్‌ను తక్షణమే పూర్తి చేసి సీతారామ ప్రాజెక్టు నీళ్లను మొదటి ప్రాధాన్యతగా కొత్తగూడెం జిల్లాకు ఇవ్వాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... కొత్తగూడెం జిల్లాలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నీళ్లను మైదాన ప్రాంతానికి తరలించడం జల దోపిడీకి నిదర్శనం అన్నారు. ఉమ్మడి జిల్లాకు మంత్రులుగా ఉన్నవారు ఆదివాసీ జిల్లాకు అన్యాయం చేయడం క్షమించరానిదన్నారు. సీతారామ ప్రాజెక్టు నీళ్ల మొదటి ప్రాధాన్యతగా భద్రాద్రి కొత్తగూడెం, మానుకోట జిల్లాలకు ఇవ్వాలన్నారు. ప్రాజెక్టు నీళ్లను కొత్తగూడెం జిల్లాకు ఇచ్చేందుకు రోళ్లపాడు రిజర్వాయర్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాత డిజైన్ ప్రకారమే సీతారామ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్కినేని సురేందర్‌రావు, బొమ్మెర్ల వరప్రసాద్, బోడా బాలు నాయక్, ఈసం నరసింహారావు, గుగులోత్ రాంచంద్, బానోతు ఊక్లా, కల్తీ సత్యనారాయణ, ఎం.శివ, సురేష్, దేవ్‌సింగ్, శివకుమార్, భూక్యా బాలకృష్ణ, లాలూనాయక్, కుమ్మరి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


తహసీల్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఎలాంటి షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ జూలూరుపాడు మండల రైతులకు అందని ద్రాక్షగానే మిగిలిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 14 విడతల్లో అందజేసిన రైతు బంధు పథకం వేలాది రైతులకు రాలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకం ఆధారంగా రైతు మాఫీ చేయడం వల్ల మాన్యువల్ పహణీపై బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వల్లమల చందర్‌రావు, బానోత్ మధు, గార్లపాటి వెంకటి, ఇల్లంగి సీతారాములు, బోడా అభిమిత్ర, బొల్లి లక్ష్మయ్య, ధరావత్ రమేష్, జె.మల్లయ్య పాల్గొన్నారు.

టీవీపీఎస్ నిరసన


నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): దివ్యాంగుల విజయాలను ఐఏఎస్ స్మితాసబర్వాల్ చూడలేకపోతున్నారని నిరసిస్తూ మంగళవారం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకని నిరసన వ్యక్తం చేశారు. గుండపనేని సతీష్ మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి వికలాంగులను కించపరిచే విధంగా ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టిన స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని, వికలాంగుల చట్టం 2016 ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో వికలాంగులకు ఎందుకు రిజర్వేషన్ ఇవ్వాలని ట్విట్టర్ వేదికగా ప్రశ్నించడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ విషయంలో కోర్టు తీర్పులు ఉన్నాయనే విషయం తెలియకుండా ఐఏఎస్ ఎలా అయ్యారని ప్రశ్నించారు. దివ్యాంగుల మనోభావాలు దెబ్బతినే విధంగా చేసిన స్మితాసబర్వాల్ వికలాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌కుమార్ మక్కడ్, జోగారావు, కాటి నాగేశ్వరరావు, ఖాదర్‌బాబా, మేడి ప్రవీణ్, శైలజ, కళాబాబు, సురేష్, సాయిబాబా, శ్రీను, గట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మద్దతు...

కొత్తగూడెంరూరల్: దివ్యాంగుల పట్ల సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ చేసిన వాఖ్యాలను నిరసిస్తూ, కొత్తగూడెం జిల్లాలోని చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ బీఎస్‌రావు మంగళవారం నల్లబ్యాడ్జి ధరించి దివ్యాంగులకు మద్దతు తెలిపారు. మాట్లాడుతూ... దివ్యాంగులకు ఐఏఎస్, ఐపీఎస్‌లో రిజ్వరేషన్లు ఎందుకివ్వాలని చులకగా మాట్లాడం సరికాదన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించాలని కోరారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయండి



మాట్లాడుతున్న ప్రసాద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రెండో ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న వారిని పర్మనెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శేషగిరి భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా భాగంగా ఏఎన్ఎంలను పర్మనెంట్ చేస్తామని లేదా గ్రాస్ సాలరీ ఇవ్వడం, పని ఒత్తిడి తగ్గింగుపై ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది కానీ, ఇంతవరకు ఆ కమిటీ సమావేశమైంది లేదని విమర్శించారు.

ప్రస్తుత ప్రభుత్వం సమస్యలపై నోరు మెదపడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బానోత్ పార్వతి, ప్రియాంక, పుష్ప, జ్యోతి, రాములమ్మ, పద్మజ, అరుణ, దేవిక, అరుణకుమారి, రాధ, రాణి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

జూలూరుపాడు: రోడ్డు భద్రతా నియమాలను ప్రజలు, వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం జూలూరుపాడు పోలీసుల ఆధ్వర్యంలో ఖమ్మం-భద్రాచలం జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా ముందుస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జాతీయ రహదారికి ఇరువైపుల డ్రైయినేజీ కాలువలపై నిర్మించిన రేకుల షెడ్లు, నేమ్ బోర్డులు తొలగించాలని, లేదంటే యజమానులు, వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి


చుంచుపల్లి: పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్

చుంచుపల్లి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతీఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని చుంచుపల్లి ఎంపీడీఓ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది భాగస్వాములయ్యారు. పనులను పర్యవేక్షించిన ఎంపీడీఓ మాట్లాడుతూ... ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఈజీఎస్ ఈసీ పిల్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: జిల్లాలో సీజనల్ వ్యాధులు రాకుండా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం మాట్లాడుతూ.. జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉండడం వల్ల, విషజర్వాలు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉంటాయని, ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొడుగు శ్రీధర్, మాలోతు గాంధీనాయక్, విజయ్ ఖమారుద్దీన్ తదితరులు ఉన్నారు.

పాల్వంచరూరల్: ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉల్వనూరు పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్రీ సూచించారు. మల్లారం గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను పరిశీలించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

బాధిత రైతులను ఆదుకోవాలి


వరిపొలాన్ని పరిశీలిస్తున్న కొత్వాల

పాల్వంచరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని అధికారులు నష్టాన్ని అంచనా వేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కిన్నెరసాని పరివాహక ప్రాంతాలైన రంగాపురం, నాగారం కాలనీలో మంగళవారం పర్యటించి పంటపొలాలను పరిశీలించారు. మాట్లాడుతూ.. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శంకర్, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, బాదర్ల జ్యోషి, నాగేశ్వరరావు, శరత్, రమేష్ పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి

జూలూరుపాడు: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ముదిగొండ వెంకటప్పయ్య ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాల, ప్రభుత్వ సంస్థలు, ఆస్పత్రులు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో దోబీ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో చాకలి కులస్తులను నియమించాలని విన్నవించారు. ప్రతీ కుటుంబానికి చాకలి బంధు పథకం కింద రూ.10 లక్షలు ఇవ్వాలని, చాకలి ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

26న ఇందిరా పార్క్ వద్ద ధర్నా

పాల్వంచ: ఈనెల 26వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద జరిగే భవన నిర్మాణ కార్మికుల మహాధర్నా, ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పాల్వంచ పట్టణ, మండల భవన నిర్మాణ తాపీ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ధరావత్ గోపి నాయక్, కోరె కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పెనుమూడి పున్నయ్య, సురేష్, గోవిందయ్య, నంది కోటయ్య, ఈశ్వరయ్య, రమణయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం కొత్తగూడెం సింగరేణి ఏరియాలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీకేఎంఎస్ – బీఎంఎస్ కార్యదర్శి పి.మాధవ నాయక్, నాయకులు రాంసింగ్ సంఘం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బీఎంఎస్‌కు దేశంలోనే అత్యధిక సభ్యత్వాలు ఉండగా, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్నామని తెలిపారు. నాయకులు జీ.వీ.కృష్ణారెడ్డి, సంగం చందర్, మొగిలిపాక రవి, ఎం.మోహన్‌రావు, బి.సుందర్ రావు, నాగేశ్వరరావు, ఏ.ఠాకూర్, పి.నరేష్, శివకుమార్, భుక్యా శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

ఇల్లెందు: బీఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఇల్లెందులో నిర్వహించారు. జేకే ఏరియాలోని బీఎంఎస్ కార్యాలయంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు నాయని సైదులు జెండా ఎగురవేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఎంఎస్ ఆవిర్భావం ఆవశ్యతను వివరించారు. లీలాకృష్ణ, అరుట్ల మాధవరెడ్డి, వై.నాగేశ్వరరావు, జి.రాజశేఖర్, సీహెచ్ శశికుమార్ పాల్గొన్నారు.

28న చంద్రశేఖర్ సంతాపసభ

జూలూరుపాడు: 28న ఖమ్మంలో జరగనున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాయల చంద్రశేఖర్ సంతాప సభను ప్రజలు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు వై.గోపాల్‌రావు, బానోత్ ధర్మా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జూలూరుపాడులో సంతాపసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

పాల్వంచరూరల్: ఉల్వనూరు గ్రామంలో మంగళవారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో రాయల చంద్రశేఖర్ సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నిమ్మల రాంబాబు, పూనెం రమేష్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ.. ఈనెల 28న ఖమ్మంలో జరగనున్న సంతాపసభను జయప్రదం చేయాలని కోరారు.

రుణమాఫీ అయిందా.. మళ్లీ తీసుకున్నారా..

టేకులపల్లి: రుణమాఫీ పొందిన ప్రతి రైతు వెంటనే రెన్యువల్ చేయించుకుని తిరిగి రుణం తీసుకోవాలని, అందుకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ సంపూర్ణ సహకారం అందిస్తారని కొత్తగూడెం జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబురావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణమాఫీ, రెన్యువల్ అంశాలపై జిల్లాలో పర్యటన కార్యక్రమంలో భాగంగా తొలిరోజు టేకులపల్లి మండలంలోని సులానగర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ గ్రామాల్లో రుణమాఫీ పొందిన రైతుల ఇళ్లకు వెళ్లి డీఏఓ నేరుగా రైతులతో మాట్లాడారు. రుణమాఫీ పొందిన ప్రతీ రైతు వెంటనే రెన్యువల్ చేయించుకుని అర్హతను బట్టి తిరిగి రుణం పొందాలన్నారు. జిల్లాలో 28,019 మంది రైతులకు సుమారు రూ.132 కోట్లు రుణమాఫీ అయిందన్నారు. రుణమాఫీ వివరాలకు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

నేటినుంచి బోనాల జాతర

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బూడిదగడ్డ బస్తీలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో బుధవారం నుంచి ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు నరేంద్రభవానీ స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. 26వ తేదీన రథోత్సవం, 28 చండీహోమం జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో మహిళలపై జరుగుతున్న గృహహింస, బాల్య వివాహాలపై ఉమెన్స్ వెల్ఫేర్ చైల్డ్ అధికారి సాహితి మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. 26 మహిళా చట్టాలపై ప్రధానంగా అవగాహన పెంచుకోవాలని మహిళలకు సూచించారు. ఎవరికైనా అన్యాయం జరిగినట్టు సమాచారం ఇస్తే తగిన చర్య తీసుకుంటామని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు జిల్లా సర్కిల్ పరిధిలో 76 కెపాసిటర్ బ్యాంకులు పెట్టినట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.బీకంసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఐదు కెపాసిటర్ బ్యాంకులు పెట్టనున్నట్లు తెలిపారు. ఇవి అమర్చడం వలన పవర్ ఫ్యాక్టర్ మెరుగుపడతుందని, వ్యవసాయ పంపుసెట్లకు, పారిశ్రామిక ఫీడర్లకు లోఓల్టేజీ వలన మోటార్లు కాలిపోకుండా ఉంటాయని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

సుజాతనగర్: 18 – 50 ఏళ్ల రైతులందరూ ఈ నెల 30వ తేదీ వరకు రైతు బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఏఓ జి.నర్మద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2024 నాటికి నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నామినీ చనిపోతే పేర్లు మార్చుకోవచ్చని, వివరాలకు 8185950935, 9182883295, 8985654898 నబర్లలో సంప్రదించాలని కోరారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో అక్టోబర్ 22, 23, 24 తేదీలలో నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం మంచికంటిభవన్‌లో ఐద్వా జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ముఖ్యవక్తగా ఆమె హాజరై మాట్లాడారు. మహిళల రక్షణ కోసం వారి హక్కుల సాధనకు అహర్నిశలు కృషి చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద మహిళా సంఘంగా ముందుకు సాగుతూ సమానత్వం స్త్రీ విముక్తి సాధన కోసం ఐక్య పోరాటాలు చేస్తూ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఐద్వా మహాసభలకు మేధావులు, అభ్యుదయవాదులు, మహిళా సంఘాల నాయకులు, శ్రామికులు, కర్షకులు, అన్నివర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బుగ్గవీటి సరళ, డి.లక్ష్మి, మండలపు జ్యోతి, సందకూరి లక్ష్మి, లీలావతి, వాణి, కున్సోత్ లక్ష్మి పాల్గొన్నారు.